10. ప్రభువ! నా నోరునిన్ – ప్రస్తుతించుచు సదా = విభవముగఁ గొనియాడ – విప్పు నా పెదవులను ॥దేవ॥

11. కోరువాఁడవు కావీ – వారయ నర్పణలు = కోరిన నర్పింతు – కోటి బలులు నీకు ॥దేవ॥

12. విఱిగిన మనసే నీ – విలసిత యర్పణము= అరయ నలిగిన హృదయ – మతి ప్రియంబౌ నీకు ॥దేవ॥

## 315 ఉన్న విధముననే నీ యొద్దకు వచ్చుచున్నాను

రా – ముఖారి తా–త్రిపుట

ఉన్నపాటున వచ్చు – చున్నాను నీ పాద – సన్నిధి కో రక్షకా = యెన్న శక్యముగాని పాపము – లన్ని మోపుగ వీపుపైఁబడి – యున్న విదె నడలేక తొట్రిలు – చున్నవాఁడను నన్ను దయఁగను ॥ఉన్న॥

1. కారుణ్యనిధి యేసు – నా రక్షకా నీ శ – రీర రక్తము చిందుట = భూరి దయతో నన్ను నీదరిఁ – జేర రమ్మని పిలుచుటయు ని – ష్కారణపు నీ ప్రేమ యిది మరి – వేరే హేతువు లేదు నా యెడ ॥ఉన్న॥

2. మసి బొగ్గువలె నా మా – నస మెల్లఁ గప్పె దో – ష సమూహములు మచ్చలై = [1]అసిత మగు ప్రతి డాగు తుడువను – [2]గసుటుఁ గడిగి పవిత్ర పరపను – [3]నసువు [4]లిడు నీ రక్తమే యని – [5]మసల కిప్పుడు సిలువ నిదె గని ॥ఉన్న॥

3. వెలపట బహు యుద్ధ – ములు లోపటను భయము – కలిగె నెమ్మది దొల గెను = పలు విధములగు [6]సందియంబుల – వలనఁ బోరాటములచే నే – నలసి యిటునటుఁ గొట్టఁబడి దు – ర్భలుఁడనై గాయములతో నిదె ॥ఉన్న॥

4. [7]కడు బీదవాఁడ [8]నం – ధుఁడను దౌర్భాగ్యుఁడను – జెడిపోయి పడి యున్నాను = [9]సుడివడిన నా మదికి స్వస్థతఁ – జెడిన కనులకు దృష్టి భాగ్యముఁ –బడయవలసిన వన్ని నీ చేఁ – [10]బడయుటకు నా [11]యొడ యఁడా యిదె ॥ఉన్న॥

---

[1]నల్లవి. [2]మైల. [3]ప్రాణములు. [4]ఇచ్చుట. [5]ఆలస్యముచేయక. [6]సందేహములు. [7]మిక్కిలి. [8]గ్రుడివాఁడను. [9]సొమ్మసిల్లిన. [10]పొందుట. [11]కర్త.



5. నీ వాగ్దత్తము నమ్మి – నీపై భారము పెట్టి –జీవ మార్గముఁ గంటిని[1] కేవలంబగు ప్రేమ చేతను – నీవు నన్ను క్షమించి చేకొని – [2]భావశుద్ధి [3]నొనర్చి సంతోషావసరముల నిడుదువని యిదె ॥ఉన్న॥

6. దరిలేని యానంద – కరమైన నీ ప్రేమ – [4]తరమే [5]వర్ణన చేయను = [6]తెరవు కడ్డం బైన యన్నిటి – విఱుగఁగొట్టెను [7]గాన నే నిపు [8]డరుదుగా నీ వాఁడ నవుటకు – మఱి నిజము నీవాఁడ నవుటకే ॥ఉన్న॥

– పురుషోత్తము ఛౌదరి

## 316 పాపపు టొప్పుకోలు

రా – కేదారగౌళ తా–ఏక

దిక్కులేని వాఁడనో ప్రభో – నీ యండజేరి – మ్రొక్కి సేవఁజేతు నో ప్రభో = మ్రొక్కి విన్నవించు వారి – యక్కరలను దీర్చు సత్యము – గ్రక్కున నిడి యాదరించు – మక్కువైన దేవ తనయ ॥దిక్కులేని॥

1. ఘోర పాప భరము నెల్లను – మోయుచు నలయు – వారలార రండటంచును = భూరి దయను బిలిచి యున్న – సార వాక్కు లెఱుఁగ కధిక – భార మొంది తుదిని నీ దరిఁ – జేరితి నన్నాదరించుము ॥దిక్కులేని॥

2. బలము లేని వాఁడనో ప్రభో – కేవలము పాప – ములను జేసి యలసితిని ప్రభో = ఇలను నే నొనర్చునట్టి – కలుష జాలములను నీవు – తొలఁగ జేసి యాత్మ కధిక – బలము నొసగి మనుపు మయ్య ॥దిక్కులేని॥

3. పామరుండ నౌట వల్లను నే నెఱుఁగనైతి – క్షేమ మిచ్చు పదవులెల్లను = కామ క్రోధ లోభములను – దీమసమున విడిచి యేసు – నామ మందు విశ్వసించి – ప్రేమను వర్తింపజేయు ॥దిక్కులేని॥

4. వందనం బొనర్తునో ప్రభో – నా డెందమందలి – సందియము లణంచు మో ప్రభో = సందియ మెడబాపి శాస్త్ర –మందు నుండు సార వాక్యానంద పదవు లనుభవింప –డెందము వెలిఁగింప వయ్య ॥దిక్కులేని॥

– చిక్కాల పాలస్

---

[1]ముఖ్యమైన. [2]మనస్సు శుచిగా. [3]చేసి. [4]శక్యమా. [5]స్తుతి. [6]మార్గము. [7]కనుక. [8]ప్రియముగా.